నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 22 మే 2025 RANGAREDDY

కుంట్లూరు కన్నీరుమున్నీరు

# ముగ్గురు దుర్మరణం

- ఒకరికి తీవ్రగాయాలు
- వారసులను కోల్పోయిన మూడు కుటుంబాలు
- ప్రమాదాలకు నిలయంగా కుంట్లూరు-పసుమాముల రోడ్డు మూల మలుపు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

పెద్దఅంబర్‌పేట, మే 21 : బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు గ్రామం కన్నీరుమున్నీరైంది. కారు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడి.. చికిత్స పొందుతున్నాడు. మరో రెండు నిమిషాల్లో ఇండ్లకు చేరుకుంటారనగా.. జరిగిన ప్రమాదం ఊరిలో విషాదం నింపింది. గ్రామంలోని బంధువులకు సంబంధించిన రిసెప్షన్ పెద్దఅంబర్‌పేటలోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించగా.. పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్‌రెడ్డి (24), చుంచు వర్షిత్‌రెడ్డి (23), ఎలిమినేటి పవన్‌కల్యాణ్‌రెడ్డి (సన్నీ) అంతా కలిసి పాల్గొన్నారు. రిసెప్షన్ అనంతరం మళ్లీ ఇండ్లకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. తర్వాత త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డికి చెందిన బైక్‌లను గ్రామంలోని పాతపంచాయతీ కార్యాలయం వద్ద పెట్టారు. సన్నీ, చంద్రసేనారెడ్డి కారులో రాగా.. నలుగురు కలిసి పసుమాములలోని సర్వీస్ రోడ్డులో ఉన్న ఫామ్‌హౌస్‌కు వెళ్లినట్టు సమాచారం. బుధవారం తెల్లవారుజామున కుంట్లూరు గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయానికి వస్తున్నారు. మరో రెండు నిమిషాల్లో అక్కడకు చేరుకుంటారనగా కుంట్లూరు-పసుమాముల రోడ్డులోని నారాయణ కాలేజీ (బాసర క్యాంపస్) సమీపంలో మలుపు వద్ద అతివేగంగా కారు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. చంద్రసేనారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. సన్నీకి తీవ్ర గాయాలు కాగా.. ప్రైవేట్ దవాఖానకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. చంద్రసేనారెడ్డి కారు నడుపుతుండగా.. సన్నీ పక్కన కూర్చున్నాడు. త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి వెనక సీట్లో ఉన్నారు. సన్నీ సీటు బెల్టు ధరించడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్టు తెలుస్తున్నది. మృతుల కుటుంబాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు పరామర్శించారు.

### వారసులు ఇక లేరు..

కుంట్లూరుకు చెందిన పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి ఒక్కగానొక్క కుమారుడు చంద్రసేనారెడ్డి. చుంచు జంగారెడ్డికి సైతం త్రినాథ్‌రెడ్డి ఒక్కడే కొడుకు. చుంచు శ్రీనివాస్‌రెడ్డికి కూడా వర్షిత్‌రెడ్డి ఒక్కడే కుమారుడు. ఒక్క రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాలకు వారసులను లేకుండా చేసింది. చుంచు జంగారెడ్డి, చుంచు శ్రీనివాస్‌రెడ్డి సొంత అన్నదమ్ములు. వీరిద్దరి కుమారులు ఒకే ప్రమాదంలో మృతిచెందడంతో విషాదం నింపింది. అల్లారుముద్దుగా పెరిగిన పిల్లలు, చేతికందే వయసులో అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాదం అలుముకున్నది. కుమారులు కండ్ల ముందే విగతజీవులుగా కనిపిస్తుండటంతో ఆయా కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చదువు పూర్తయిన పిల్లలు.. ఇక కంటికి రెప్పలా చూసుకుంటారనే పడుతున్న ఆశలన్నీ ఒక్క ప్రమాదంతో ఆవిరైపోయాయి.

### ముంచిన మలుపు

కుంట్లూరు-పసుమాముల రోడ్డులో నారాయణ కాలేజీ (బాసర క్యాంపస్) వద్ద మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. మూడు నెలల వ్యవధిలో ఐదారుకుపైగా ప్రమాదాలు ఇక్కడే జరిగాయి. అయినప్పటికీ ఒక్క సూచిక బోర్డు కూడా లేదు. గత వారం ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురయింది. ఇంకా ఆ కారును అక్కడి నుంచి తొలగించకముందే మరో ప్రమాదం ముగ్గురిని బలిగొన్నది. కల్వర్టు వద్ద రోడ్డు చిన్నదిగా మారడం, మలుపు దగ్గరకు వచ్చేవరకు వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా రోడ్డును విస్తరించి, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### ప్రమాదస్థలిని పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ

కుంట్లూరు రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి స్థానికులు వారికి వివరించారు. సీసీటీవీ పుటేజీలను పరిశీలించారు. ప్రమాదానికి గురయిన వాహనాలను అక్కడ నుంచి తరలించారు.



ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ

## అమలు చేయలేదు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 21 : ప్రజల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీలో 75 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీల్లో ఒక్క హామీనీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్నారు. రేవంత్ సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేంతవరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, కమిషనర్ వాణిరెడ్డి పాల్గొన్నారు.

# రక్తమోడుతున్న రహదారులు

- అతివేగం.. అజాగ్రత్తతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- గత పదిహేను రోజుల్లో 20 మందికి పైగా మృత్యువాత
- కుంట్లూరు ఘటనలో వారసులను కోల్పోయిన మూడు కుటుంబాలు
- ప్రమాదాలపై ఫోకస్ పెట్టని పోలీసులు
- ఓఆర్‌ఆర్‌పై స్పీడ్ లిమిట్స్ పెంచడంతో పెరుగుతున్న ప్రమాదాలు

రంగారెడ్డిజిల్లాలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. అతివేగం, అజాగ్రత్తతో ఎంతో మంది కన్నవారికి దూరమవడంతోపాటు కట్టుకున్నవాళ్లకు కూడా కన్నీళ్లు మిగిలిస్తున్నారు. మరికొంతమంది అంగవైకల్యంతో ఇంటికే పరిమితమవుతున్నారు. ప్రమాదాల నివారణపై పోలీసులు ఫోకస్ పెట్టకపోవడం వలన ఈ ప్రమాదాలు అధికమవుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. గత పదిహేను రోజుల్లో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 నుంచి 30 వరకు మృత్యువాత పడ్డారు. మరో 20 మంది వరకు కాళ్లు, చేతులు పోగొట్టుకుని ఇండ్లకే పరిమితమయ్యారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున రంగారెడ్డిజిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు పసుమాముల రహదారిలో ముగ్గురు యువకులు మృత్యువాతపడ్డారు. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ప్రమాదంలో మరణించిన ముగ్గురు కూడా తల్లిదండ్రులకు వారసులు లేకుండా చేశారు. ఈ వరుస రోడ్డు ప్రమాదాల సంఘటనలతో జిల్లావాసులు ఉలిక్కిపడుతున్నారు. ప్రమాదాలను అరికట్టాల్సిన పోలీసులు చలాన్లపై ఉన్న దృష్టి ప్రమాదాల నివారణపై పెట్టడంలేదనే ఆరోపణలొస్తున్నాయి.

- రంగారెడ్డి, మే 21 (నమస్తే తెలంగాణ)



కుంట్లూరు-పసుమాముల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎంను ఢీకొన్న కారు

ఓఆర్‌ఆర్‌పై గతంలో స్పీడ్ లిమిట్స్ 100 మాత్రమే ఉండగా, ప్రస్తుతం దానిని గంటకు 120 కిలోమీటర్లకు పెంచారు. దీంతో ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిపోతున్నది. ఇటీవల ఔటర్ రింగ్‌రోడ్డుపై రావిర్యాల వండర్‌లా సమీపంలో చెట్లకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను బ్రీజా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొంగరకలాన్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు మృత్యువాతపడ్డారు. అలాగే, ఈ నెల 10న తెల్లవారుజామున ఓఆర్‌ఆర్‌పై గండిచెరువు బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొని చెలరేగిన మంటల్లో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 19న ఓఆర్‌ఆర్‌పైన కొహెడ సమీపంలో ఆగి ఉన్న లారీని పాల ట్యాంకర్ ఢీకొని మరో వ్యక్తి మృతిచెందాడు. వారం రోజుల క్రితం ఓఆర్‌ఆర్‌పై బొంగ్లూరు గేటు సమీపంలో బ్రీజా కారు బోల్తాపడి నల్లవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇటీవలే ఓఆర్‌ఆర్‌పై బొంగ్లూరు సమీపంలో కలకత్తాకు చెందిన హీలాల్ అనే వ్యక్తి ఓఆర్‌ఆర్ రెయిలింగ్‌కు ఢీకొని మృతిచెందాడు. 12న ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డులో ట్రక్కును ఢీకొని మరో వ్యక్తి మృతిచెందాడు. జిల్లా పరిధిలో హైదరాబాద్ బీజాపూర్, హైదరాబాద్ బెంగళూరు, నాగార్జునసాగర్ హైదరాబాద్, శ్రీశైలం హైదరాబాద్, విజయవాడ హైదరాబాద్ రహదారులున్నాయి. ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బీజాపూర్ హైదరాబాద్ రహదారిని విస్తరించడానికి ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో రెండు నెలల క్రితం రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న రైతులపైకి లారీ దూసుకెళ్లి పలువురు మృత్యువాతపడ్డారు. అయినప్పటికీ ప్రభుత్వం ఈ రహదారుల విస్తరణతోపాటు అభివృద్ధి చేయడంలో శ్రద్ధ చూపడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

### జరిగిన ప్రమాదాలన్నీ అతివేగం, అజాగ్రత్తతోనే..

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలన్నీ అతివేగం, అజాగ్రత్త వల్లనే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతివేగంగా వాహనాలు నడపడం వలన అభం, శుభం తెలియని పక్కవారు కూడా ప్రాణాలు వదులుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ఈ ప్రమాదాల్లో కొన్ని ప్రమాదాలు మద్యం మత్తులో జరుగగా, మరికొన్ని అతివేగం, అజాగ్రత్త వల్లనే జరిగినట్లు పోలీసులు తెలుపుతున్నారు.

### కన్నవాళ్లకు, కట్టుకున్నవాళ్లకు కన్నీళ్లే..

ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలది ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతిచెందడంతో కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. అలాగే, చేతికందివచ్చిన కుమారులు చనిపోయి వారి తల్లిదండ్రులకు తీవ్ర గర్భశోకాన్ని మిగిలిస్తున్నారు. హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కుంట్లూరులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మరణించిన చంద్రసేనారెడ్డి, వర్షిత్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి చనిపోవడంతో వారి కుటుంబాలకు వారసులు లేకుండా పోయారు. చెంచు శ్రీనివాస్‌రెడ్డి, చెంచు జంగారెడ్డి అన్నాదమ్ములు, ఈ ప్రమాదంలో వారి కుమారులు వర్షిత్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి మృతిచెందటంతో వారి రోదనలు మిన్నంటాయి. వారి మృతితో కుంట్లూరు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

### ప్రమాదాల నివారణపై చర్యలు శూన్యం

జిల్లాలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రమాదాల నివారణకు పోలీసులు ఫోకస్ పెట్టడంలేదనే ఆరోపణలొస్తున్నాయి. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు చలాన్లపై దృష్టి సారించారని.. సివిల్ పోలీసులు వాహనాల ప్రమాదాలను అరికట్టడంలేదని ఆరోపణలొస్తున్నాయి. ముఖ్యంగా ఓఆర్‌ఆర్‌పై స్పీడ్ గన్స్ లేకపోవడం, పెట్రోలింగ్ సిబ్బంది లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఓఆర్‌ఆర్‌కు సమీపంలో ఉన్న ట్రామా సెంటర్లు కూడా పనిచేయడంలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సలు అందించడం కోసం ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది కూడా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.



ఓఆర్‌ఆర్‌పై అతివేగంగా వచ్చి మరో వాహనం ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన బ్రీడా కారు (ఫైల్)

# ఉగ్ర భయం వల్లే.. ఐపీఎల్ రద్దు?

- మూడు మ్యాచ్‌ల రద్దుకు కారణమదేనా?
- ముందే పసిగట్టిన నిఘా సంస్థలు
- అరెస్టయిన నిందితుల సోషల్ మీడియా నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా



సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో జరుగాల్సిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఎందుకు రద్దయ్యాయి..? విజయనగరంలో బయటపడ్డ బాంబు పేలుళ్ల కుట్రకు ఈ ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుకు ఏమైనా సంబంధాలున్నాయా? దేశ ద్రోహం కేసు ఎదుర్కొంటున్న హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసుకు ఏమైనా లింకులున్నాయా? ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుపై ప్రజల్లో భిన్న రకమైన చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ల బందోబస్తుకు రాచకొండ పోలీసులకు మంచి మార్కులొచ్చాయి. అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సైతం నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా.. హైదరాబాద్‌లో జరుగాల్సిన క్రికెట్ మ్యాచ్‌లను రద్దు చేసి, వాటిని మరో వేదికపై ఎందుకు నిర్వహిస్తున్నారని చర్చించుకుంటున్న సమయంలోనే హైదరాబాద్‌లో ఉగ్ర కుట్రకు విజయనగరం నుంచి భారీ స్కెచ్ వేశారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఉగ్ర కుట్రకు, ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుకు లింకులున్నాయనే వాదన వినిపిస్తున్నది.

### ఇంకా మూడు మ్యాచ్‌లు..

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 10న సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్, 20న ఫస్ట్ క్వాలిఫయర్ మ్యాచ్, 21న ఎలిమినేటర్ మ్యాచ్ జరుగాల్సి ఉన్నది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో ఐపీఎల్-2025ని వారం రోజుల పాటు వాయిదా వేస్తూ ఈ నెల 9న బీసీసీఐ ప్రకటించింది. ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించగానే బీసీసీఐ మ్యాచ్‌ల నిర్వహణపై చర్చించుకొని, 17 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటే మిగిలిన ఐపీఎల్ మ్యాచ్‌ల వేదికలలో మార్పులను కూడా వెల్లడించింది. అందులో హైదరాబాద్‌లో జరుగాల్సిన మూడు మ్యాచ్‌ల వేదికలు మారాయి. హైదరాబాద్‌లో జరుగాల్సిన మూడు మ్యాచ్‌లను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చింది..? హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌తోపాటు రాచకొండ పోలీసులు నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని బీసీసీఐకి చెప్పినట్లు తెలిసింది. అప్పటి వరకు ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఆరు క్రికెట్ మ్యాచ్‌లకు నిర్వహించిన బందోబస్తుపై రాచకొండ పోలీసులను ఐపీఎల్ నిర్వాహకులు ప్రశంసించినట్లు అధికారులు తెలిపారు. అయినా కూడా హైదరాబాద్‌లో మ్యాచ్‌లకు ఎందుకు చోటివ్వలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

### ఎవరెవరిని కలిశారో..

విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్, సికింద్రాబాద్‌కు చెందిన సమీర్‌లను విజయనగరం పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా వేదికగా ఒక్కటైన ఇరువురు దేశవ్యాప్తంగా పేలుళ్లకు కుట్ర పన్నినట్లు విచారణలో బయటపడింది. సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన సమీర్ లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తూ కొన్ని సామాజిక సేవ కార్యాక్రమాల పేరుతో యువకులను ఆకర్షించినట్లు సమాచారం. దాంతోపాటు రాత్రి వేళల్లో చాలా మంది యువకులతో గ్రూప్ మీటింగ్‌లు పెడుతూ ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్నాడనే విషయం విచారణలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఇద్దరు మరికొంత మందితో దేశవ్యాప్తంగా సోషల్‌మీడియా వేదికగా తమ నెట్‌వర్క్‌ను భారీగా పెంచుకున్నారు. బాంబులు తయారుచేసి వాటిని విజయనగరం ప్రాంతంలోని అడవుల్లో ఈ నెల 21, 22 తేదీల్లో పేల్చి రిహార్సల్స్ చేయాలనుకున్నారు. ఆ తరువాత ఎక్కువ మొత్తంలో టిఫిన్ బాంబులు తయారుచేసి వాటిని హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రధాన నగరాల్లో పేల్చి బీభత్సం సృష్టించేందుకు కుట్ర చేశారనే విషయం విచారణలో తేలింది. ఇందులో ప్రధానంగా హైదరాబాద్ ప్రస్తావన రావడం, సికింద్రాబాద్‌కు చెందిన సమీర్ నిర్వహించిన గ్రూప్ మీటింగ్‌లకు చాలా మంది యువకులు హాజరైనట్లు సమాచారం రావడంతో నిఘా సంస్థలు ఆరా తీస్తున్నాయి. ఆయా మీటింగ్‌లలో క్రికెట్ మ్యాచ్‌లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాలకు సంబంధించిన అంశాలు కూడా చర్చించుకునే అవకాశాలున్నాయి. అయితే హైదరాబాద్‌కు ఉగ్ర ముప్పు ఉండే అవకాశాలను ముందుగానే నిఘా సంస్థలు గుర్తించి ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణను రద్దు చేసుకోవాలని సూచనలు చేసినట్లు తెలుస్తున్నది. మరో పక్క హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరికొంత మంది పాకిస్తాన్‌కు సహకరిస్తుండటంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో యూట్యూబర్ జ్యోతి హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వీడియోలు తీసింది.. ఆమె కూడా అరెస్ట్ కావడం గమనార్హం.

### ఉగ్ర కుట్రకు స్కెచ్..

హైదరాబాద్‌లో గతంలో జరిగిన ఉగ్రవాద ఘటనల నేపథ్యం ఉండడం, ఆపరేషన్ సిందూర్ తరువాత స్లీపర్ సెల్స్, ఉగ్ర సానుభూతిపరులు యాక్టివేట్ అయ్యే అవకాశాలపై నిఘా సంస్థలు హెచ్చరించిన నేపథ్యంలోనే క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు హైదరాబాద్ సరైన వేదిక కాదని నిర్వాహకులు భావించారా? అనే సందేహాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో ఉగ్ర కుట్రకు విజయనగరం నుంచి స్కెచ్ వేశారని వెలుగులోకి రావడంతో ఆ సందేహాలు నిజమనే వాదన వినిపిస్తున్నది. నిఘా సంస్థలు ముందుగానే హెచ్చరించడంతోనే బీసీసీఐ ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణను రద్దు చేసి ఉండవచ్చని క్రికెట్ అభిమానులు పేర్కొంటున్నారు.

### తనిఖీలు



శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బీడీ, డాగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీలు చేపట్టారు. వికారాబాద్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. - వికారాబాద్, మే 21



హిమాయత్‌నగర్ చౌరస్తా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు



కొహెడ రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోయగా వర్షం రావడంతో టార్పాలిన్లు కప్పిన రైతులు

# కుండపోత వర్షం

మొయినాబాద్‌లోని జాతీయ రహదారిపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

మొయినాబాద్, మే 21 : బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురవడంతో మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నీళ్లు నిలువడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని ఓ హోటల్ ఎదుట 2 ఫీట్ల ఎత్తు వరకు వరద నీరు చేరింది. చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, కర్నాటక వెళ్లే వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. మొయినాబాద్‌లో ఏ-వన్ మోటర్ ఎదుట వరద నీరు రావడంతో వాహనదారులు అసౌకర్యంగా ఫీలయ్యారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట కూడా నీళ్లు నిలిచిపోయాయి. కొహెడ రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోయగా వర్షం రావడంతో రైతులు టార్పాలిన్లు కప్పారు.




హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్ ఎదుట పార్కు చేసిన వాహనాలు



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట కుంటను తలపిస్తున్న వరద నీరు